క్లుప్తంగా

పంపన సాయిబాబుకు సత్కారం


సత్కారం అందుకున్న సాయిబాబు

వీరవాసరం: ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో వీరవాసరం ఉపాధ్యాయుడు పంపన సాయి బాబు పాల్గొన్నారు. యువకుల కోసం పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. సమ్మేళనంలో సాయి బాబు పాల్గొని కవిత్వంలో తన ప్రతిభను చాటారు. కవిత్వంలో ప్రతిభ కనబరిచిన పంపన సాయిబాబును, మండలి బుద్ధ ప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, జీవీ పూర్ణచందు ఘనంగా సత్కరించారు. పంపన సాయిబాబు మాట్లాడుతూ మార్పు కోరే రచనలపై రచయితలు దృష్టి సారించటానికి ఈ సభలు తోడ్పడతాయన్నారు. ఈ సందర్భంగా పంపన సాయి బాబును ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాసు, సిబ్బంది అభినందించారు.

పౌర హక్కులపై అవగాహన తప్పనిసరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భారతీవిజయలక్ష్మి

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎన్.భారతీవిజయలక్ష్మి అన్నారు. మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఒకరినొకరు గౌరవించుకుంటూ అసమానతలకు తావు లేకుండా జీవనాన్ని సాగించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో రన్నర్లుగా విష్ణు విద్యార్థులు


కబడ్డీ రన్నర్లను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులు రన్నర్లుగా నిలిచారని కళాశాల పీడీ ఎం.శ్రీనివాస రావు చెప్పారు. విజేతలను సోమవారం కళాశాల వద్ద అభినందించిన సందర్భంగా వివరాలను తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖపట్టణంలో విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. కబడ్డీ విజేతలను ప్రిన్సిపాల్ ఎం.వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి శ్రీనివాసరావు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు ఏఎస్ఎన్ఎం విద్యార్థి

పాలకొల్లు సెంట్రల్: ఏపీ రాష్ట్రస్థాయి పురుషుల సీనియర్ వాలీబాల్ జట్టుకు స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 27న ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన సీనియర్స్ వాలీబాల్ రాష్ట్రస్థాయి జట్టుకు తమ కళాశాల బీఏ ఎకనామిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థి గుబ్బల శ్రీనివాస్ ఎంపికయ్యాడని తెలిపారు. జనవరి 7 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, వ్యాయామ విద్యా అధ్యాపకులు జి.మహేష్, విద్యార్థులు అభినందించారు. కళాశాలలో ప్రముఖ కవి మరియు నాటక కర్త రోదియార్డ్ కిప్లింగ్ 159వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి కిప్లింగ్ జీవిత చరిత్ర, అతని రచనలను విద్యార్థులకు వివరించారు.

ఎమ్మార్వీకి సాహిత్య రత్న పురస్కారం

పెనుగొండ: స్థానిక కవి, కథా నటక, నవలా రచయి త ఎమ్మార్వీ సత్యనారాయణ మూర్తి సాహిత్య రత్న జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకొన్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం పెనుగొండలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ముదిగొండలో జరిగిన పుడమి జాతీయ వేదిక సభలో పురస్కారం అందుకున్నట్టు చెప్పారు. వృక్ష ప్రేమికులు పద్మశ్రీ పి.రామయ్య, భక్త రామదాసు పదవ వారసులు కంచర్ల శ్రీనివాస్, పుడమి జాతీయ అధ్యక్షుడు సీహెచ్ బాల్‌రెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ సీహెచ్ హైమావతి, అన్నం పౌండేషన్ చైర్మన్ ఎ.శ్రీనివాసరావుల చేతుల మీదుగా అందుకొన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వీని ఎస్వీకేపీ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు, త్యాగరాజు గాన సభ అధ్యక్షురాలు కె.అన్నపూర్ణ, పలువురు ప్రముఖులు అభినందించారు.

సచివాలయాలకు చంద్ర గ్రహణం

- కళను కోల్పోతున్న సచివాలయాలు
- గతంతో పోలిస్తే 75 శాతం సేవలు కట్
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజానీకం


రాయకుదురు సచివాలయం

వీరవాసరం: కూటమి ప్రభుత్వంలో సచివాలయాలకు 'చంద్ర' గ్రహణం పట్టుకుంది. చంద్రబాబు విధానాలతో సచివాలయ వ్యవస్థ నీరుగారుతుంది. గతంలో గ్రామీణులు ఏ చిన్న పని ఉన్నా వేకువ జామునే లేచి మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో బయలుదేరేందుకు సిద్ధ పడేవారు. దీంతో ఉదయం పూట చేసుకునే వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పైగా సదరు సమస్యపై రోజుల కొలది కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవి కావు. ఇది గ్రహించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే బృహత్ సంకల్పంతో పంచాయతీ కేంద్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులు, గ్రామీణులకు సమస్యల పరిష్కారానికి స్పందనను అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు 139 రకాల సేవలను అందించేవారు. ప్రతి రోజూ స్పందన గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలానే రైతులు, గ్రామీణుకు అవసరమైన ధృవీకరణ పత్రాలు సచివాలయాల ద్వారా పొందేవారు. అలానే సంక్షేమ పథకాలు అందించడలోనూ ఈ వ్యవస్థ క్రీయాశీలకంగా వ్యవహరించింది.

కూటమి పాలనలో చిన్నచూపు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వెలుగు వెలిగిన సచివాలయాలు 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చిన్నచూపునకు గురయ్యాయి. ప్రజలకు 139 రకాల సేవలను అందించే సచివాలయాల్లో 75 శాతం పైగా సేవలను కూటమి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో ఏ పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలన్న లబ్ధిదారులు మీ–సేవా కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు రైతులకు గత ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చిన పంట బీమా పథకం ప్రీమియాన్ని తీసి వేసింది. దీంతో రైతులే పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. పైగా వీటిని నమోదు చేసుకునేందుకు మీ–సేవా కేంద్రాల బాట పట్టాల్సి వస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటికే వచ్చి వలంటీర్లు సంక్షేమ పథకాలకు పేర్లు నమోదు చేసుకొని లబ్ధి చూకూర్చేవారని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం పింఛన్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుందామని సచివాలయాలకు వెళితే సర్వర్ పని చేయడం లేదని చెబుతుండటంతో లబ్ధిదారులు దిక్కు తోచని పరిస్థితుల్లో వెనుదిరుగుతున్నారు.

సంక్షేమ సారథులు.. వలంటీర్లు

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికీ అందాయి. ఇందులో ప్రధాన భూమిక పోషించింది. వలంటీర్లేనని చెప్పాలి. ఏ పథకమైనా ప్రతి అర్హుడికి అందాలనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా వలంటీర్లు పని చేశారు. అలానే కరోనా కష్టకాలంలో వీరు చేసిన సేవలు వెలకట్టలేనివి. కాగా గతంలో చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై నోరుపారేసుకున్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి వారికి గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థ అనేది లేదని, వాటిని కొనసాగించడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని అసెంబ్లీ సాక్షిగా తన మంత్రుల ద్వారా చెప్పించి, వంటీర్లను వెన్నుపోటు పొడిచాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావొస్తున్నా వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వలంటీర్లు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నప్పటికీ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలో గ్రామ సచివాలయాల సంఖ్య 15, ఉద్యోగస్తులు 133 మంది పని చేస్తున్నారు. వంటీర్లు 258 మంది పని చేసేవారు.

ఉమా సోమేశ్వరస్వామిని దర్శించుకున్న డీఐజీ


ఉమా సోమేశ్వర స్వామి వారి సన్నిధిలో డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ నయీమ్ అస్మి

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామ క్షేత్రం శ్రీఉమా సోమేశ్వర స్వామి వారిని ఏలూరు రేంజ్ డీఐజీ వి.అశోక్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎస్పీ నయీమ్ అస్మి ఆయన వెంట ఉన్నారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి సుబ్బారావు డీఐజీకి స్వామి వారి చిత్ర పటం అందజేశారు.

పీజీఆర్ఎస్‌కు మూడు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు మూడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. మండలంలోని అజ్జమూరు గ్రామంలో రుద్రయ్యకోడు ఆక్రమణల ఇళ్లను తొలగిస్తారని చెబుతున్నారని, వాటి తొలగింపు విషయం ప్రజలకు వివరించాలని గ్రామానికి చెందిన వర్ధినీడి వీరవెంకట సత్యనారాయణమూర్తి ఫిర్యాదు చేశారన్నారు. గ్రామంలోని ఐస్ ఫ్యాక్టరీ వ్యర్థాలు పంట కాలువలోకి వదులుతున్నారని, దీని వలన అజ్జమూరు, కుప్పనపూడి గ్రామ ప్రజలకు కలుషిత నీరు అందుతుందని గ్రామానికి చెందిన బచ్చు కృష్ణారావు ఫిర్యాదు చేశారన్నారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు బట్వాడా చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని కోలమూరులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై బైండోవర్ కేసులు

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పేకాట, కోడి పందేలు నిర్వహించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. పాములపర్రు గ్రామంలో ముగ్గురిని బైండోవర్ చేసి తహసీల్దార్ నాగార్జున ఎదుట హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు.

నారుమడుల పరిశీలన

మొగల్తూరు: మొగల్తూరు గ్రామంలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం తదితర ప్రాంతాల్లో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సోమవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచిన నారుమడులను ఆయన పరిశీలించారు. మడుల్లో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడాలని రైతులకు సూచించారు. చలి వాతావరణంలో నారు ఎదుగుదల తక్కువగా ఉంటుందని, ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉంటే 5 సెంట్ల నారుమడికి 2 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వెదజల్లాలని తెలిపారు. ముదురు నారుతో నాట్లు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

విద్యుదాఘాతానికి లారీ క్లీనర్ మృతి

పెద్దాపురం: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందినట్టు పెద్దాపురం ఎస్సై మౌనిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని చినబ్రహ్మదేవం కేబీకే బయోటెక్ పరిశ్రమకు లారీలో సరకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో లారీపై బరకాలను తొలగిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం మట్టపర్రు గ్రామానికి చెందిన క్లీనర్ పెచ్చెట్టి నాగేశ్వరరావు (60) అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటుచేశామని చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెడతామని పేర్కొన్నారు. 12 గంటలకు సాధారణ సమావేశం ఉంటుందని తెలిపారు. సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

ఎలక్ట్రీషియన్లు నైపుణ్యం పెంపొందించుకోవాలి


చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఆకివీడు: ఎలక్ట్రీషియన్లు పనిలో నైపుణ్యం పెంపొందించుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక కాటన్ పార్కులో మండల ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఏడో వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ యూనియన్‌కు స్థల కేటాయింపునకు సహకరిస్తానని చెప్పారు. విప్ పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్లు విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. కౌన్సిలర్ గేదల అప్పారావు మాట్లాడుతూ చేతి పనులకు మంచి డిమాండ్ ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా యర్రా కేసవరావు, గౌరవధ్యక్షుడిగా బండారు నటరాజ్ కుమార్, గౌరవ సలహాదారుడిగా నరహరశెట్టి నానాజీ, కార్యదర్శిగా కొప్పర్తి సత్యనారాయణ, కోశాధికారిగా అబ్దుల్ సర్దార్ ఎన్నికయ్యారు.

క్రీస్తు మార్గంతో నూతన శకంలోకి వెళ్లాలి

వాడవాడలా క్రిస్మస్ సంబరాలు


భీమవరం: బేతని చర్చిలో పాటలు పాడుతున్న యూత్ సభ్యులు

ఆకివీడు: క్రీస్తు మార్గంతో నూతన శకంలోకి ప్రవేశించాలని సీఆర్ పళ్లెం దేవదాసు బోధించారు. మండలంలోని చినమిల్లిపాడు గ్రామంలోని సీబీసీఎన్‌సీ చర్చిలో కిస్మస్ ముంగింపు వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం నేటి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు ఇంటి ప్రేమానందం ఆర్థిక సహాయంతో భోజన వసతి సమకూర్చారు. కార్యక్రమంలో పాస్టర్ డేవిడ్ రాజు, సంపూర్ణ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

బేతని చర్చిలో యూత్ క్రిస్మస్ వేడుకలు

భీమవరం: క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు ప్రేమ, సహనం, దాతృత్వం, త్యాగం కలిగి ఉండి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పాస్టర్ కిరణ్ పాల్ అన్నారు. బేతని చర్చిలో యూత్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్.డానియేల్‌పుష్పరాజ్, పట్టా దేవరాజు, వర్గీస్ డానియేల్, గంటా సుందరకుమార్, ఎస్.ఎలిజిబెత్ రాణి, ఎం.ఆండ్రూస్, టి.రోహిత్ మ్యాత్యూస్, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు జననంతోనే ప్రపంచానికి పాప క్షమాపణ

ఉండి: ఏసుక్రీస్తు జననంతోనే ప్రపంచానికి పాప క్షమాపణ కలిగిందని రెవరెండ్ డి.మేషక్ సతీష్‌కుమార్ అన్నారు. ఉండి మండలం చిలుకూరు సెంయింట్ థోమా లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి స్త్రీల కన్వీనర్ యిజ్జిని సువార్త ఆధ్వర్యంలో స్త్రీల క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. స్త్రీల సమాజ సభ్యులు, అతిథులు పాడిన క్రిస్మస్ ప్రత్యేక గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఎన్నార్పీ అగ్రహారంలోని 10 సంఘాల పేరిష్ స్త్రీల కన్వినర్ సిస్టర్ ప్రణీత మేషక్ ఆధ్యక్షతన క్రిస్మస్ కేక్ కట్ చేసారు.ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో చర్చి సీఆర్, తదితరులు పాల్గొన్నారు.


ఆకివీడు: చినమిల్లిపాడులో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు


ఉండి: క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న క్రైస్తవులు

ఆధ్యాత్మికం.. ఆహ్లాదభరితం


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు

కాళ్ల: ఆహ్లాద వాతావరణంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం ఎంతో ప్రశాంతతనిస్తుందని భక్తులు చెబుతున్నారు. కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ధనుర్మాసం శీతాకాలం కావడంతో ఆలయ ప్రాంగణంలో పలు రకాల పూల మొక్కలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూల మొక్కల చెంతసేద తీరుతుంటే ఎంతో పారవశ్యం పొందుతున్నామని భక్తులు చెబుతున్నారు. ఆలయ కమిటీ వారిని ఉద్యోగులను భక్తులు దాతలు అభినందిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రతి ఏటా ఈ విధంగా పూల మొక్కలను ఏర్పాటు చేస్తామని ఆలయ కార్య నిర్వాహణాధికారి మోకా అరుణ్‌కుమార్ తెలిపారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ


త్యాగరాజ ఆరాధనోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జనవరి ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు శ్రీత్యాగరాజ మ్యూజిక్ అకాడమీ (త్యాగరాజ భక్తసభ) అధ్వర్యంలో 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. జనవరి ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు సాయంత్రం ఆరున్నర గంటల నుంచి ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం, పదో తేదీన ఏఎస్ఆర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడుతూ ఆరో తేదీన ఉదయం ఎనిమిదిన్నర గంటలకు స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం ఆరున్నర గంటలకు ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కారుమూరి బాబు, చెరుకువాడ వెంకట్రామయ్య, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

4న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

పాలకొల్లు సెంట్రల్: కలియుగ దైవం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణం 32వ వార్షికోత్సవాలు జనవరి 4 నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక మేడికొండ శ్రీనివాసరావు కార్యాలయంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కలిదిండి కృష్ణవర్మ మాట్లాడుతూ పట్టణంలో గత 31 సంవత్సరాలుగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పెనుమదం రోడ్డులో ఉన్న ఆర్ఆర్ రైస్ మిల్లులో జనవరి 4, 5, 6 తేదీల్లో స్వామి వారి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. 4న ఉదయం దేవరపల్లి రామకృష్ణ దంపతులచే గణపతి హోమం, సాయంత్రం మంత్రి నిమ్మల రామానాయుడు దంపతులచే స్వామివారి దివ్య కల్యాణం, 5న ఉదయం సామూహిక సత్యదేవుని వ్రతాలు, లక్ష్మీనారాయణ ఫ్రూట్స్ వారి చే సత్యదేవుని హోమం, అన్నవరం నుంచి వచ్చిన సత్యదేవుని వ్రత రథం, పురోహితుల ఆధ్వర్యంలో 2 వేల కలశాలతో సత్యదేవుని వ్రతం నిర్వహిస్తామన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం


సమావేశంలో సంతాపం తెలుపుతున్న సభ్యులు

ఆకివీడు: నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం సోమవారం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. కౌన్సిలర్ నిమ్మల నాగు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ప్లాన్లను త్వరితగతిని మంజూరు చేసే విధంగా నగర పంచాయతీ అధికారులు సహకరించాలన్నారు. అదే విధంగా టౌన్ ప్లానింగులు సక్రమంగా లేవని ఆరోపించారు. పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉందని, ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికీ వినియోగించడం లేదన్నారు. దోమల మందు పిచికారీ చేయాలని సూచించారు. వైస్ చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ నీటి కుళాయి పన్ను వసూళ్లను త్వరితగతిన పూర్తి చేసి పట్టణ అభివృద్ధికి కేటాయించాలని సూచించారు. చైర్ పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కమిషనర్, సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కమిషనర్ జి.కృష్ణమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

యలమంచిలి: ఏన్నో ఏళ్ల నాటి భూసమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారమవుతున్నాయని డిప్యూటీ తహసీల్దార్ పి.డేవిడ్‌సన్ అన్నారు. మండలంలోని మేడపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం 3, రీప్లేస్మెంట్ పాస్ పుస్తకం కోసం 1, విస్తీర్ణంలో తేడాలు సరిజేతకు 1, జాయింట్ ఎల్‌పీఎం స్ప్లిట్టింగ్ కోసం మూడు కలిసి మొత్తం ఎనిమిది దరఖాస్తులు రైతులు అందజేశారు.

స్థల సర్వే కోరుతూ ఫిర్యాదు

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో శేరేపాలెంకు చెందిన కత్తుల సత్యనారాయణ తన స్థలాన్ని సర్వే చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, పీఆర్ఏఈ పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి


నిరసన ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు

భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని జిల్లా వామపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం భీమవరం సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శనగా అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదదర్శులు బి.బలరామ్, కోనాల భీమారావు మాట్లాడుతూ పార్లమెంటులో రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలో భాగంగా అంబేడ్కర్ నామస్మరణ కంటే భగవాన్ నామస్మరణ చేసి ఉంటే బాగుంటుందని అమిత్‌షా మాట్లాడడం అంబేడ్కర్‌ను అవమానించడమేనన్నారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, చెల్లబోయిన రంగారావు, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.క్రాంతి బాబు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఇంజేటి శ్రీనివాస్, దేగల నాగేశ్వరరావు, బత్తుల విజయ్‌కుమార్, త్రిమూర్తులు, గోపాలకృష్ణంరాజు, మల్లుల సీతారాంప్రసాద్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.